
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 31.0 । కనిష్ఠం : 21.0

5



నాగర్‌కర్నూల్

జిల్లా వార్తలు

ఆదివారం 12 అక్టోబరు 2025

బాలుర విభాగంలో తలపడుతున్న మహబూబ్ నగర్, ఖమ్మం జట్ల క్రీడాకారులు



6

ఫైనల్‌కు మహబూబ్‌నగర్, నారాయణపేట జట్లు

- ట్రెడిషనల్ బాలుర విభాగంలో
- నేడు ఫైనల్స్

సైబర్ ఉచ్చులో 12.50లక్షలు మాయం

- నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఘటన

7

టెండర్

- మద్యం దుకాణాలకు దరఖాస్తులపై అనాసక్తి
- రెండేళ్ల క్రితంతో పోలిస్తే స్పందన కరువు
- నష్టాలే కారణమంటున్న ప్రస్తుత లైసెన్సుదారులు
- పాత దరఖాస్తుదారులకు ఎక్సైజ్ అధికారుల ఫోన్లు
- అమ్మకాలు అధికంగా ఉండే దుకాణాలపై సిండికేట్ల నజర్



రండి బాబు.. రండి.. మద్యం దుకాణాలకు టెండర్లు వేయండి.. గడువు సమీస్తోంది. వెంటనే టెండర్లు వేయాలని సాక్షాత్తు అధికారులే గతంలో మద్యం దుకాణాలకు టెండర్లు వేసిన వారికి ఫోన్ చేయడం ఇప్పుడు చర్చనీయంగా మారింది. గతంలో కనీవినీ ఎరుగని రీతిలో మద్యం దుకాణాలకు దరఖాస్తులు వచ్చేవి. ఈ సారి సాధారణ ఎన్నికలు లేకపోవడంతో పాటు దరఖాస్తు రుసుము పెంచడంతో దరఖాస్తులు చేసుకునేందుకు సుముఖత చూపడం లేదనే తెలుస్తోంది.

నాగర్‌కర్నూల్/గద్వాల క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు రెండేళ్ల క్రితం ఎక్సైజ్ కార్యాలయాల వద్ద వ్యాపారులు బారులు తీరేవారు. పోటీగా వచ్చిన వారికి గుడ్‌విల్ ఇవ్వడం.. నయానో భయానో నచ్చచెప్పి వైన్‌షాపులను దక్కించుకునే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు వ్యాపారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దరఖాస్తులు అరకొరగా వస్తుండటం ఎక్సైజ్ అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది.రాష్ట్ర ఖజానాకు ప్రధాన ఆదాయ వనరు అయిన మద్యం దుకాణాలపై ప్రత్యేక దృష్టి సారించడం, వైన్ షాపుల కోసం అధికంగా పోటీ ఉండేలా చూడాలని ఆదేశాలు ఉండడంతో ఒత్తిడికి గురవుతున్నారు. 2023లో దరఖాస్తు చేసుకుని, లాటరీలో దుకాణాలు దక్కని వారికి కూడా ఫోన్‌లు చేసి, టెండర్లలో పాల్గొనాలని అభ్యర్థిస్తున్నారు.

ముందుకురాని దరఖాస్తుదారులు

నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని 5 సర్కిళ్ల పరిధిలో 67 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటిలో గౌడ సామాజిక వర్గానికి 9, దళితులకు 9, ఎస్టీలకు 4 రిజర్వ్ చేశారు. జనరల్ కేటగిరిలో 45 షాపులు ఉన్నాయి. 2023లో ఒక్కో వైన్‌షాపుకు దరఖాస్తు చేసుకోవడానికి వాపస్ రాని ధరావత్తును రూ. 2 లక్షలుగా నిర్ణయించారు. అప్పట్లో మొత్తం 2,531 మంది దరఖాస్తు చేసుకోగా, ఒక్క నాగర్‌కర్నూల్ జిల్లా నుంచే రాష్ట్ర ఖజానాకు దాదాపు రూ.5 కోట్ల ఆదాయం వచ్చింది.

జోగుళాంబ గద్వాల జిల్లాలో 2023లో గద్వాల, అలంపూర్ స్టేషన్ పరిధిలో మొత్తం 36 మద్యం దుకాణాలకు 1,179 దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం గద్వాల స్టేషన్ పరిధిలో 21, అలంపూర్ స్టేషన్ పరిధిలో 13 మొత్తం 34 దుకాణాలకు కుదించడంతో పాటు దరఖాస్తు రుసుము రూ.3 లక్షలకు పెంచడంతో వ్యాపారులు వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

వెనక్కి తగ్గిన సిండి'కేట్లు'

పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో 2023లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు వైన్ షాపులను ప్రభుత్వపరం చేసుకుని, తమకు నచ్చిన బ్రాండ్లను అనుమతించడంతో మద్యం వ్యాపారులు తెలంగాణపై దృష్టి సారించారు. హైదరాబాద్ కేంద్రంగా వైన్‌షాపులను దక్కించుకునేందుకు సిండికేట్లుగా ఏర్పడటం, అందులో పొరుగు రాష్ట్రానికి చెందిన వారికి భాగస్వామ్యం కల్పించడంతో ఒక్క నాగర్‌కర్నూల్ జిల్లాలోనే దాదాపు 2 వేల దరఖాస్తులను ఎక్సైజ్ శాఖకు అందజేశారు. విశేషమేమిటంటే డిప్ పద్ధతిన కొనసాగినా కేటాయింపులో వారికి కేవలం నష్టాలను మిగిల్చే 6 దుకాణాలు మాత్రమే దక్కాయి. రెండు సంవత్సరాలకు రెంటల్, ఇతరాత్రా నిర్వహణ ఖర్చులు కోటి రూపాయలకు చేరడంతో వారికి నష్టాలు మిగిలాయి. ప్రస్తుతం అక్కడ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, మద్యం పాలసీని మార్చడంతో గతంలో ఏర్పడిన సిండికేట్లు మన రాష్ట్రంలో మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. 2023లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు రావడం, తాము పెట్టిన పెట్టుబడి రావడంతో పాటు మద్యానికి ఇతరులపై ఆధారపడకుండా ఉంటుందని మద్యం దుకాణాలను దక్కించుకోవడానికి కొన్ని రాజకీయ పక్షాలకు చెందిన నాయకులు తమ అనుచరులను పురమాయించినట్లు విమర్శలు ఉన్నాయి. అయితే ఇప్పుడు వైన్‌షాపులను దక్కించుకున్నా 2027 వరకే లైసెన్సు ఉంటుంది. ఆ తర్వాత కొత్త పాలసీ వస్తే తాము ఆర్థిక భారాన్ని మోయాల్సి వస్తుందనే భావనతో వ్యాపారులు ముందుకు రావడం లేదు. జిల్లాల్లో లాభాలు అధికంగా వస్తున్న మద్యం దుకాణాలకు సంబంధించి, పార్టీల ప్రమేయం లేకుండా కొందరు సిండికేట్‌గా ఏర్పడినట్లు తెలుస్తోంది. తమ ప్రమేయం లేకుండా ఎవరూ దరఖాస్తు చేసుకోకుండా అడ్డుకట్ట వేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

ఓటు చోరీతోనే కేంద్రంలో బీజేపీకి అధికారం

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం సర్కారు సంస్థలను జేబు సంస్థలుగా వాడుకుంటోందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం వనపర్తి జిల్లా కొత్తకోటలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు చోరీతోనే బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిందని, మోదీ ప్రధాని అయ్యాక ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడిందన్నారు. ఏఐసీసీ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ సాక్ష్యాధారాలతో ఓటు చోరీని బయట పెట్టారని గుర్తు చేశారు. ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకుపోవాల్సిన బాధ్యత పార్టీ నాయకులపై ఉందన్నారు. బీసీ రిజర్వేషనులను అడ్డుకోవడంలో బీఆర్‌ఎస్, బీజేపీ ప్రధాన పాత్ర వహించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లోకి వచ్చే బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులను రిజర్వేషన్లపై ప్రశ్నించాలని సూచించారు. అనంతరం రూ.5 కోట్లతో సంతస్థలం అభివృద్ధి పనులు చేపట్టడానికి చెనగచెర్వు కట్టను పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులతో చర్చించి కట్ట వెడల్పు పరిగణలోకి తీసుకొని అందరికి సౌకర్యంగా ఉండేవిధంగా అభివృద్ధి చేద్దామని తెలిపారు. అంతకు ముందు కూరగాయల మార్కెట్ స్థలాన్ని పరిశీలించారు. సమావేశంలో మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, బోయోజ్, కృష్ణారెడ్డి, డాక్టర్ బాబు, బీచుపల్లి యాదవ్, శ్రీనివాసులు, శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సర్కార్ బడుల్లో డిజిటల్ బోధన

- విద్యార్థుల సామర్థ్యాల పెంపే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు
- 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు డిజిటల్ పాఠాలు
- జోగుళాంబ గద్వాల జిల్లాలో 474 ప్రభుత్వ పాఠశాలలు
- 25,751 మంది విద్యార్థులకు అందనున్న సాంకేతిక విద్య



డిజిటల్ లర్నింగ్‌పై శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్ భాస్కర్ పాపన్న

గద్వాల సర్కిల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రతిభతో పాటు సృజనాత్మకతను వెలికి తీసి వారికి అత్యాధునిక సాంకేతికపరమైన పరిజ్ఞానాన్ని అందించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ బోధనకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా విద్యాశాఖ యంత్రాంగం విడతల వారీగా గణితం, ఫిజికల్ సైన్స్, ఇంగ్లిష్, సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులకు 'ఏ బుక్ ఆన్ డిజిటల్ లర్నింగ్' అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం గద్వాల జిల్లాలో గణితం ఉపాధ్యాయుల శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి.

శిక్షణలో ప్రధాన అంశాలివే...

ప్రధానంగా 'ఏ బుక్ ఆన్ డిజిటల్ లర్నింగ్' శిక్షణలో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించేలా సాంకేతిక నిపుణులు మాడ్యూల్‌ను రూపొందించారు. వాటిలో గణితం, ఫిజికల్స్ సైన్స్ విభాగంలో కోడింగ్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఫిజికల్ కంప్యూటింగ్, ఇంగ్లిష్, సోషల్ స్టడీస్ విభాగంలో డిజైన్ థింకింగ్, డిజిటల్ సిటిజన్‌షిప్ అంశాలను చేర్చారు.

డిజిటల్ మాస్టర్ ట్రైనర్స్ ఆధ్వర్యంలో...

ఈ ఏడాది నుంచే విద్యార్థులకు డిజిటల్ విద్యాబోధన అందించేందుకు హైదరాబాద్‌లో ప్రత్యేక శిక్షణ పొందిన డిజిటల్ డిస్ట్రిక్ట్ రీసోర్స్ పర్సన్స్ (డీడీఆర్‌పీ) మాస్టర్ ట్రైనర్స్‌గా వ్యవహరిస్తున్నారు. వీరికి సహాయకులుగా డిజిటల్ మండల రీసోర్స్ పర్సన్స్ తోడ్పాటునందిస్తున్నారు.

జిల్లాలో 25,751 మంది విద్యార్థులు..

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 6 నుంచి 9వ తరగతి విద్యార్థులు 25,751 విద్యార్థులున్నారు. ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 12,163 మంది, ఉన్నత పాఠశాలలో 13,588 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారిలో 6వ తరగతి 5,289 మంది, 7వ తరగతి 6,874 మంది, 8వ తరగతి 6,821 మంది, 9వ తరగతి 6,767 మంది విద్యార్థులు ఉన్నారు.

నీట మునిగి ఇద్దరు సోదరుల మృతి

- అడ్డాకుల మండలంలోని బలీదుపల్లిలో ఘటన

7

రైతుల కష్టాలకు చెక్

- నారాయణపేట, వనపర్తి జిల్లాలకు ఆధునిక యంత్రాలు
- ధాన్యం తూర్పు పట్టడంతో పాటు ఆరబెట్టనున్న మిషన్లు
- వరి, మొక్కజొన్న జొన్నల కోసం వినియోగం



పెబ్బేరు మార్కెట్ ఆవరణలో ఉన్న వడ్లు ఆరబెట్టే(డ్రయ్యర్)యంత్రం

6

దుందుభీకి తగ్గని వరద ఉధృతి

-సిర్సవాడ వద్ద మూడు నెలలుగా నిలిచిన రాకపోకలు

తాడూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : దుందుభీ నదికి వరద ఉధృతి తగ్గడం లేదు. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని సిర్సవాడ గ్రామం వద్ద మూడు నెలలుగా నది ఉధృతంగా ప్రవహించడంతో కల్వకుర్తి, ఊర్కొండ, మిడ్జిల్, తలకొండపల్లి మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు ఇటు జడ్చర్ల అటు మేడిపూర్ మీదుగా దుందుభీ నది దాటాల్సిన పరిస్థితి నెలకొంది. సిర్సవాడకు హామ్లేట్ విలేజ్ అయిన సిర్సవాడ కాలనీవాసులు మూడు నెలలుగా సిర్సవాడకు రాలేని పరిస్థితి నెలకొంది. కాలనీకి చెందిన వృద్ధులు పింఛన్ల కోసం సుమారు 60కిలో మీటర్లు ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. దుందుభీ నది ఉధృతంగా ప్రవహించడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



సిర్సవాడ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభీ నది

చెరుకు ఫ్యాక్టరీలో ప్రమాదం

- ఏడుగురికి గాయాలు

6

శ్రీశైలం ప్రాజెక్టుకు తగ్గిన ఇన్‌ఫ్లో

- కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి

6

మద్యం మత్తులో కాలువలో పడి వ్యక్తి మృతి

6

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 110.00
హోల్ సేల్	: 116.00
డ్రెస్డ్	: 191.00
స్కిన్ లెస్	: 218.00

వ్యవసాయం లాభదాయకం

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్
- రైతులు వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి సారించాలి
- 'ధన్ ధాన్య కృషి యోజన' పథకాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ



పాలెం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పీఎండీడీకేవై పథకం వర్చువల్ ప్రారంభోత్సవాన్ని తిలకిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, అధికారులు

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వెనుకబడిన 100 జిల్లాలోని రైతులకు చేయూతనందించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన'(పీఎండీడీకేవై) పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. ప్రయోగాత్మకంగా మొదటి విడతలో నాగర్‌కర్నూల్ జిల్లాలో ఈ పథకం అమలు చేస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. శనివారం దేశరాజధాని ఢిల్లీ వ్యవసాయ విశ్వ విద్యాలయం నుంచి భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ఈ పథకాన్ని ప్రారంభించారు. నాగర్‌కర్నూల్ జిల్లా పాలెం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పీఎండీడీకేవై పథకం వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ బదావత్ సంతోష్, డీసీసీబీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లా వ్యవసాయ రంగానికి ఎంతో ప్రయోజనకరంగా ఉండేలా 11 శాఖల్లో అమల్లో ఉన్న 36 పథకాలను సమ్మిళితం చేసి ఈ పథకం అమలు కానుందని తెలిపారు. పీఎండీడీకేవై పథకం అనేక ప్రయోజనాలను అందిస్తుందని, పంట దిగుబడిని పెంచడానికి ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మెరుగైన నీటి పారుదల పద్ధతులను ఈ పథకం ప్రోత్సహిస్తుందన్నారు. ఇది మార్కెట్ యాక్సెస్‌ను పెంచడం, వైవిధ్యమైన పంటలను ప్రోత్సహించడం ద్వారా రైతులకు మెరుగైన ఫలితాలను ఇస్తుందని తెలిపారు. రైతులు వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం చేపడితే లాభదాయకమని, వాటిపై దృష్టి సారించాలని కలెక్టర్ అన్నారు. వర్చువల్‌గా ప్రధాని మోదీ మాట్లాడుతూ రైతులు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని, వ్యవసాయం, రైతులకు దేశాభివృద్ధిలో ప్రధాన పాత్ర ఉందని, పాల ఉత్పత్తిలో ప్రపంచంలో మనం ప్రథమ స్థానంలో ఉన్నామని చెప్పారు. వ్యవసాయ రంగంలో నేడు రెండు పథకాలను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాలెం వ్యవసాయ కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్‌రావు, డీఆర్‌డీఏ పీడీ చిన్న ఓబులేష్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి జ్ఞానశేఖర్, జిల్లా విజయ డైరీ డీడీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెరుకు రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి

- కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ చెరుకు రైతుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న

6

నైపుణ్యాలను పెంచుకోవాలి

ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డి

పాలమూరు యూనివర్సిటీ , అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): యువకులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి అన్నారు. శనివారం పీయూలోని ఫార్మసీ ఆడిటోరియంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. బాలకిష్టారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, నిరుద్యోగులు-ఉపాధి అవకాశాలు-నైపుణ్యాభివృద్ధి గురించి ప్రసంగించారు. ప్రస్తుతం ప్రపంచంలో కెల్లా భారతదేశంలో తెలంగాణ ఫార్మ కంపెనీలు మొదటి స్థానంలో ఉండి, ఎందరికో ఉద్యోగాలు కల్పిస్తున్నాయని అన్నారు. పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ పీయూ పరిధిలో చాలా మంచి నైపుణ్యాలు కలిగిన నిరుద్యోగులు ఉన్నారన్నారు. వారు ఇలాంటి అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. రాష్ట్రంలో ఉన్నత విద్యామండలి ద్వారా మెగా జాబ్‌మేళా నిర్వహించడం మొదటిసారి అని, అందుకు చైర్మన్ బాలకిష్టా రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బల్క్ డ్రగ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ రోజారాణి మాట్లాడుతూ ప్లేస్మెంట్ డ్రైవ్‌కి వచ్చిన 8 కంపెనీలకు గాను 6 కంపెనీలు డైరెక్ట్‌గా ఉద్యోగాలు కల్పిస్తున్నాయన్నారు. 2 కంపెనీలు మూడు నెలలు స్టైఫండ్ ఇస్తూ ట్రైనింగ్ పీరియడ్‌లో ప్రతిభ ఆధారంగా ప్లేస్మెంట్ ఇస్తాయన్నారు. 320 ఉద్యోగాలకు 145 మంది నిరుద్యోగులు మాత్రమే హాజరయ్యారని, ఎంపికైన వారిని త్వరలో ప్రకటిస్తామని పీయూ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ఎన్ అర్జున్ కుమార్ తెలిపారు.



గత ఏడాది నిర్వహించిన జాతీయస్థాయి అండర్-17 హ్యాండ్‌బాల్ టోర్నీలో తలపడుతున్న క్రీడాకారులు(ఫైల్)

7

ఎస్‌జీఎఫ్ క్రీడా పండుగ

- ఉమ్మడి జిల్లాలో ఒక జాతీయ, 8 రాష్ట్రస్థాయి టోర్నీలకు ఆతిథ్యం

బీఆర్ఎస్, బీజేపీలు బీసీలకు చేసిందేంది?

» మాజీ మంత్రి జే చిత్తరంజన్‌దాస్



కల్వకుర్తిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్

కల్వకుర్తి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్, బీజేపీలు బీసీలకు చేసింది ఏందో చెప్పాలని మాజీ మంత్రి జే చిత్తరంజన్‌దాస్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో బీసీలకు కులగణన చేసి స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లను కల్పించాలని చూస్తుంటే సహకరించాల్సిన ప్రతిపక్షాలు విమర్శించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కల్వకుర్తి పట్టణంలోని తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ బీసీలను విస్మరించిందని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీ బిల్లుకు ఎందుకు సహకరించడం లేదని ఆయన ప్రశ్నించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఆయన తెలిపారు. సమావేశంలో అంజయ్యగౌడ్, లక్ష్మయ్యగౌడ్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెరుకు ఫ్యాక్టరీలో ప్రమాదం

● ఏడుగురికి గాయాలు



ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఫ్యాక్టరీ కార్మికులు

కొత్తకోట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీలో శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఏడుగురికి గాయాలయ్యాయి. బాధితుల వివరాల మేరకు ఫ్యాక్టరీ నుంచి వెలువడే వ్యర్థ పదార్థాలను డ్రైనేజీ నుంచి తొలగిస్తుండగా కింద పడిపోయారు. ఒకరిని కాపాడడానికి మరొకరు ప్రయత్నిస్తూ ఏడుగురు డ్రైనేజిలో పడ్డారు. సమీపంలోని తోటి కార్మికులు కిందపడిన కార్మికులను చాకచక్యంగా బయటకు తీసి చికిత్స నిమిత్తం కొత్తకోటలోని ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. గాయపడిన వారిలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అనోజ్, కౌల్, దామోదర్, సనోజ్, విజయ్, పింటుతో పాటు ఆత్మకూర్ మండల ఆరెపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ ఉన్నారు. ఫిర్యాదు లేని కారణంగా కేసు నమోదు చేయలేదని ఎస్ఐ ఆనంద్ తెలిపారు. శనివారం హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వారిని చెరుకు అభివృద్ధి మండలి మాజీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, బీసీ సంఘాల నాయకులు రాములు యాదవ్, భీమన్న నాయుడు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఫ్యాక్టరీ యజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

మద్యం మత్తులో కాలువలో పడి వ్యక్తి మృతి



సోలీపూర్ శివారులోని కాలువలో పడి మృతి చెందిన బుపాని బోయ వెంకటయ్య

ఖిల్లాఘణపురం ,అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం సోలీపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. బాలానగర్ మండలం గుండేడ్ గ్రామానికి చెందిన బుపాని బోయ వెంకటయ్య (35) మద్యం సేవించి శుక్రవారం సోలీపూర్ నుంచి రుక్కన్నపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు సమీపంలోని కాలువ వద్దకు మూత్ర విసర్జనకు వెళ్తున్న సమయంలో జారి కాలువలో పడి మృతి చెందాడు. సోలీపూర్ గ్రామానికి చెందిన బుపాని మణెమ్మ, గుండేడ్ గ్రామానికి చెందిన బుపాని బోయ వెంకటయ్యకు 9 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఈనెల 10వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం మృతుడు వెంకటయ్యతో కలిసి భార్య మణెమ్మ తల్లి ఊరు సోలీపూర్ గ్రామానికి వచ్చారు. మృతుడు వెంకటయ్య మద్యం తాగి బయటకు వెళ్లి మళ్లీ మద్యం సేవించాడు. కుటుంబ సభ్యులు మద్యం మత్తులో ఉన్న వెంకటయ్యను ఇంటికి తీసుకువచ్చారు. మత్తులోనే మళ్లీ బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మృతుడు వెంకటయ్యను వెతికే క్రమంలో గ్రామ శివారు సోలీపూర్ నుంచి రుక్కన్నపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు సమీపంలో కాలువలో పడి ఉన్నాడని గ్రామస్థులు తెలిపారు. సంఘటన స్థలానికి వెళ్లి చూసేసరికి వెంకటయ్య మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య బుపాని మణెమ్మ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

ఆటోలో నుంచి జారి పడి వృద్ధుడు..

ఇటిక్యాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల పరిధిలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని దువాసిపల్లి గ్రామానికి చెందిన పెద్ద బీసన్న(70) తన స్వంత పనుల నిమిత్తం ఎర్రవల్లి వెళ్లి పనులు ముగించుకొని తిరిగి దువాసిపల్లికి ఆటోలో వెళ్లుతున్నాడు. సాసనూల్ గ్రామసమీపంలో ప్రమాదవశాత్తు ఆటో నుంచి జారి పడితలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గద్వాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లాలని సూచించడంతో అక్కడికి తరలించారు. అక్కడి డ్యూటీ వైద్యులు పరీక్షించి మరణించినట్టు తెలిపారని గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య లచ్చమ్మ, నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మహమ్మదాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం పై నుంచి పడిన వ్యక్తికి గాయాలైన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండల సమీపంలో జరిగింది. వివరాల్లోకెళితే మండల పరిధిలోని అన్నారెడ్డిపల్లి తండా గ్రామానికి చెందిన వికాస్(21) తన ద్విచక్ర వాహనంపై సొంత పని నిమిత్తం మండల కేంద్రానికి వెళుతున్నాడు. రోడ్డుపై బైక్ అదుపు తప్పి కిందపడి ఎడమ చేయి విరగగా, ఎడమకాలికి బలమైన గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారమిచ్చారు. వెంటనే 108 వాహనం అక్కడకు చేరుకొని ఈఎంటీ జానమ్మ, పైలెట్ అక్బర్‌లు క్షతగాత్రునికి ప్రథమ చికిత్స చేసి అనంతరం మహబూబ్‌నగర్ లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రైతుల కష్టాలకు చెక్

» ఆధునిక యంత్రాలతో తొలగనున్న ఇక్కట్లు

» వ్యవసాయ మార్కెట్‌లకు తూర్పు పట్టడం, వడ్లు ఆరబెట్టే యంత్రాలు



ఆటోమేటిక్ క్లీనింగ్ యంత్రంలో శుద్ధి చేసిన ధాన్యం ట్రాక్టర్‌లో వేస్తూ..

నారాయణపేట/పెబ్బేరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ధాన్యం శుభ్రపరిచేందుకు గాను ఆటోమేటిక్ క్లీనింగ్, డ్రయ్యర్ యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. వీటి వల్ల ఎలాంటి మనుషుల అవసరం లేకుండా ధాన్యం కుప్పల నుంచి పైప్ ద్వారా మిషన్ తీసుకొని హైస్పీడ్ క్లీనింగ్ యంత్రంతో ధాన్యాన్ని క్షణాల మీదుగా శుభ్రం చేస్తుంది. ధాన్యం తేమ ఉంటే డ్రై చేసేందుకు మరో డ్రై యంత్రం ద్వారా ధాన్యంలో ఉన్న తేమ లేకుండా శుద్ధి చేస్తుంది. ఈ రెండు యంత్రాలు రైతాంగానికి ఎంతగానో దోహద పడుతాయి. ఉమ్మడి జిల్లాలోని నారాయణపేట, మక్తల్, కోస్గితో పాటు పెబ్బేరు మార్కెట్ కమిటీలకు ధాన్యం తూర్పు పట్టేందుకు 4 యంత్రాలు, వరిని ఆరబెట్టేందుకు ఒక యంత్రాన్ని అందజేసింది. సింగిల్ ఫేస్ కరెంట్‌తో పాటు డీజిల్‌తో ఈ యాంత్రాలు పనిచేస్తాయి.

తూర్పు పట్టడం, ఆరబెట్టే సమస్యలు ఇక ఉండవు

గతంతో పోల్చితే వరిసాగు భారీగా పెరిగింది. హార్వెస్టర్‌తో వరి కోసిన ధాన్యంలో తాలు, చెత్త ఉంటుంది. దీనికి తోడు వరి ధాన్యాన్ని ఆరబెటడం రైతులకు పెద్ద సమస్యగా మారింది. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యంలో తాలు, చెత్త ఉండడంతో పాటు తేమ శాతం లేకపోవడంతో తూకం చేయడం కోసం నిర్వాహకులు నిరాకరిస్తారు. దీంతో రైతులు తీవ్ర నిరాశ చెంది తక్కువ ధరకు ధాన్యాన్ని దళారులకు విక్రయిస్తుంటారు. ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం యంత్రాలను అందజేసింది. ఈ యంత్రాలను ఆయా కొనుగోలు కేంద్రాలకు అందజేసి సమస్యలను పరిష్కరించేందుకు నిర్వాహకులు కృషి చేస్తారు.

కొనుగోలు కేంద్రాలకు పంపిస్తాం



వరి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యంలో తాలు, చెత్త ఉన్న వాటిని తూర్పు పట్టే నాలుగు యంత్రాలున్నాయి. ధాన్యంలో తేమ శాతం లేకపోవడంతో వడ్లను ఆరబెట్టేందుకు (డ్రయ్యర్)యంత్రం అందుబాటులో ఉంది. ఈ యంత్రాలను ఆయా కొనుగోలు కేంద్రాలకు అందజేస్తాం. సీజన్ అయిపోయిన వెంటనే తిరిగి యంత్రాలను మార్కెట్ ఆవరణంలో భద్రపరుస్తాం.

- అనీల్ కుమార్, కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్, పెబ్బేరు

రైతుల సంక్షేమం కోసం సీఎం కృషి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతాంగం సంక్షేమం కోసం అధునికంగా ప్రతీ వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఆధునికంగా ఉండే క్లీనర్, డ్రయ్యర్ యాంత్రాలను అందుబాటులోకి తీసుకు రావడం వల్ల రైతులకు మేలు చేకురుతుంది. మనుషల అవసరం లేకుండా యంత్రాలతో ధాన్యం శుద్ధి అయి తేమ శాతం తగ్గేలా యంత్రాలు ఉపయోగపడుతాయి. రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వినియోగించుకోవాలి.

- శివారెడ్డి, మార్కెట్ చైర్మన్, నారాయణపేట

ఫైనల్‌కు మహబూబ్‌నగర్, నారాయణపేట జట్లు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రాష్ట్ర నెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ శిరీషరాణి



ఫైనల్‌కు చేరిన మహబూబ్‌నగర్ జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి నెట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీ రసవత్తంగా కొనసాగుతున్నది. ఈ టోర్నీలో మహబూబ్‌నగర్, నారాయణపేటతో పాటు రంగారెడ్డి, నల్గొండ జట్లు ఫైనల్ బెర్తును ఖరారు చేసుకున్నాయి. శనివారం జరిగిన ట్రెడిషనల్ విభాగంలో బాలుర మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 16-14 పాయింట్లతో ఖమ్మంపై, రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో నారాయణపేట జట్టు 19-17 పాయింట్లతో నల్గొండపై గెలిపొందాయి. బాలికల విభాగంలో జరిగిన మొదటి సెమీఫైనల్‌లో రంగారెడ్డి జట్టు 20-17 పాయింట్లతో నిజామాబాద్‌పై, రెండో సెమీఫైనల్‌లో నల్గొండ జట్టు 20-15తో మహబూబ్‌నగర్‌పై గెలిచాయి. బాలుర విభాగంలో మహబూబ్‌నగర్-నారాయణపేట, బాలికల విభాగంలో రంగారెడ్డి, నల్గొండ జట్లు ఫైనల్‌కు చేరాయి.

నెట్‌బాల్ టోర్నీలో క్రీడాకారులు ప్రతిభ చాటాలి

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని చాటాలని రాష్ట్ర నెట్‌బాల్ అసోసియే షన్ సెక్రటరీ శిరీషరాణి అన్నారు. మహబూబ్‌నగర్ ప్రధాన స్టేడియంలో శనివారం రెండో రోజు నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను ఆమె హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెట్‌బాల్‌లో రాష్ట్ర క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించారని గుర్తుచేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో నెట్‌బాల్‌లో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదని తెలిపారు. ట్రెడిషనల్, 3వ ఫాస్ట్-5, 1వ మిక్స్‌డ్ విభాగాల్లో ఆయా జట్ల క్రీడాకారులు ప్రతిభ చాటి విజేతలుగా నిలువాలని ఆకాక్షించారు. రాష్ట్ర అధ్యక్షుడు విక్రమాదిత్యరెడ్డి, ఖాజాఖా న్, రాంమోహన్, అంజద్ అలీ, అక్రమ్, షరీఫ్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

ఖిల్లాఘణపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఖిల్లాఘణపురం మండలంలోని సోలీపూర్ గ్రామ శివారు ప్రాంతంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న టాటా ఏసీ ట్రాలీ ఆటో వాహనాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. సోలీపూర్ గ్రామ శివారు ప్రాంతంలో శనివారం సాయంత్రం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఖిల్లాఘణపురం వైపు వస్తున్న టాటా ఏసీ ట్రాలీ వాహనాన్ని పోలీసులు పరిశీలించారు. వాహనంలో 40 బస్తాల (సుమారు 18 క్వింటాళ్లు) రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నారు. ఊర్కొండ మండలం రేవల్లి గ్రామానికి చెందిన వాహన డ్రైవర్ గొడుగు కృష్ణను ప్రశ్నించగా వనపర్తిలో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద రేషన్ బియ్యం కొనుగోలు చేసి తరలిస్తున్నానని తెలిపినట్లు వివరించారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడిన పీడీఎస్ బియ్యంతో అధికారులు

మరికల్, (ఆంధ్రజ్యోతి): ధన్వాడ మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎంమినోనిపల్లి గ్రామ శివారులో శనివారం బొలెరో వాహనంలో అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. విచారించగా నర్వ మండలంలోని పలు గ్రామాల్లో పీడీఎస్ బియ్యం సేకరించి కర్ణాటక తీసుకెళుతున్న తిరుమలాయపల్లి గ్రామానికి చెందిన బొలెరో డ్రైవర్ నరేందర్, మక్తల్ మండలం శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన ఓనర్ బాలరాజు 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తర లిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు.

డీటీ పంచనామా అనంతరం డ్రైవర్, ఓనర్‌లపై కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌చార్జి ఎస్ఐ సురేష్ తెలిపారు.

కంటి వైద్యుడి అదృశ్యంపై వీడిన మిస్టరీ

» 17 పేజీల సూసైడ్ నోట్ రాసి అదృశ్యమైన కంటి వైద్యుడు క్షేమం

» సూసైడ్ నోట్‌లో చేసిన ఆరోపణలు అవాస్తవం...

» మహబూబ్‌నగర్ వస్తున్న క్రమంలో పోలీసులకు దొరికిన రమేష్‌నాయక్

మద్దూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మద్దూర్‌లో ఓ వర్గానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై 17 పేజీల సూసైడ్ నోట్ రాసి అదృశ్యమై కంటి వైద్యుడు ఎట్టకేలకు పోలీసులకు దొరకాడు. ఈ మేరకు శనివారం మద్దూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అదృశ్య ఘనటపై కంటి వైద్యుడు తెలిపిన వివారాలను సీఐ సైదులు, ఎస్ఐ విజయ్‌కుమార్‌లు వెల్లడించారు.

మద్దూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట కంటి పరీక్ష కేంద్రాన్ని నిర్వహిస్తున్న రమేశ్‌నాయక్ మద్దూర్‌కు చెందిన తాజొద్దీన్, యాసీన్‌లపై మత విద్వేషాలు రగిలించే విధంగా పలు వివాదాస్పద, సున్నితమైన అంశాలతో కూడిన ఆరోపణలు చేస్తూ 17పేజీల సూసైడ్ నోట్ రాసిండు. తాను ట్రైన్ కింద పడి ఆత్మహత్య చేసుకోబోతున్నానని ఆ నోట్‌లో పేర్కొని తన మిత్రుల ఫోన్లకు వాట్సాప్ చేసి గత నెల 28న అదృశ్యమయాడు, కాగా, సోషల్ మీడియాలో వైరల్ అయి సంచలనంగా మారి ఆయా సంఘాల నాయకుల ఆందోళన, నిరసనలకు కారణమైంది. రమేష్ నాయక్ అదృశ్యంపై తండ్రి దామ్లా నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారం భించినట్లు సీఐ తెలిపారు. ఇందుకు మూడు బృందాలను ఏర్పాటు చేసి ఆచూకీకై వెతకసాగారు. శనివారం హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్‌కు వస్తున్న క్రమంలో తమ గాలింపు సందర్భంగా దొరికిన రమేష్‌నాయక్‌ను 17 పేజీల వివాదాస్పద సూసైట్ నోట్‌పై విచారించగా పలు విషయాలను రమేష్ నాయక్ వెల్లడించినట్లు తెలిపారు.



రమేష్‌నాయక్‌ను విలేకరుల ముందు ప్రవేశపెట్టిన పోలీసులు

ఆ వివరాలిలా...

మద్దూర్‌లో ల్యాబ్‌ను కొనసాగించే తన మిత్రుడు రాంచెర్‌కు రూ.10 లక్షలు అప్పుగా ఇప్పించా. అతను వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకోగా ఆ డబ్బులు తాను చెల్లించాలని అప్పు ఇచ్చిన రిజ్వాన్ సోదరులు తాజొద్దీన్, యాసీన్‌లు ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో పాటు ఆ అప్పును తనపై బదలాయించి తన మిత్రులతో కూడా అప్పు చెల్లింపుపై చెప్పించారు. తనను ఇంత ఒత్తిడికి గురి చేసిన వారు కూడా వేరే రకంగా ఆ బాధను అనుభవించాలనే ఉద్దేశంతో వివిధ రాకాల ఆరోపణలు చేస్తూ 17 పేజీల సూసైడ్ నోట్ రాయడం జరిగిందని రమేశ్‌నాయక్ వెల్లడించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఈ విషయాన్ని విలేకరులు అడగగా సూసైడ్ నోట్‌లో చేసిన ఆరోపణలన్నీ అవాస్తవమని స్పష్టం చేశారు. రమేష్ నాయక్‌ను దొరకబట్టిన టీం బృందం సభ్యులు ఎస్ఐ విజయ్‌కుమార్, టాస్క్‌ఫోర్సు ఎస్ఐ పురుషోత్తం, హెడ్ కానిస్టేబుల్ వాసురాంనాయక్, పుల్సా నాయక్, నాగమల్లయ్య, పరందాములు, రాఘవేందర్‌రెడ్డి, హన్మంతు, రామస్వామి, రాఘవేందర్ గౌడ్‌లను ఈ సందర్భంగా సీఐ అభినందిచారు.

చెరుకు రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి

» కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ చెరుకు రైతుల సంఘం ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు రాజన్న



ఆత్మకూరు జోన్ సమావేశంలో మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న

ఆత్మకూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): చెరుకు రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ చెరుకు రైతుల సంఘం ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు రాజన్న డిమాండ్ చేశారు. ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఆత్మకూరు జోన్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నరేంద్రమోదీ ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులకు మద్ధతు ధర ప్రకటించిన మాదిరిగానే చెరుకు పంటకు కూడా మద్ధతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పత్తి పంటకు మద్ధతు ధర ప్రకటించిన మాదిరిగానే చెరుకు పంటకు టన్నుకు రూ.6వేలు ఇవ్వాలని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ధాన్యానికి క్వింటాల్‌కు 500 బోనస్ ప్రకటించిన మాదిరిగానే చెరుకు పంటకు కూడా ట న్నుకు వెయ్యి ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం సకాలంలో కటింగ్ కార్మికులను రప్పించి సీరియల్ మాదిరిగా చెరుకు పంట కటింగ్ చేసేందుకు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెరుకు రైతుల సంఘం నాయకులు మాసన్న, వాసారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, చంద్రసేనారెడ్డి, రంగారెడ్డి, తిరుపతయ్యతో పాటు ఆయా గ్రామాల చెరుకు రైతు లు పాల్గొన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు తగ్గిన ఇన్‌ఫ్లో

» కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి

గద్వాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు తగ్గిపోవడంతో కృష్ణా ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో తగ్గిపోయింది. శనివారం శ్రీశైలం ప్రాజెక్టుకు 88,582 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే ఉన్నది. ఒక గేటును ఎత్తి 27,983 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తితో పాటు కాలువలు, ఎత్తిపోతల ద్వారా 76,008 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 214.84 టీఎంసీలు నిల్వ ఉన్నది. ఆల్మటి, నారాయణపూర్ ప్రాజెక్టు గేట్లు మాతపడగా విద్యుత్ ఉత్పత్తి ద్వారా 6 వేల క్యూసెక్కులు అవుట్‌ఫ్లో ఉన్నది. భీమా నది ద్వారా మరో 50 వేల క్యూసెక్కులు జూరాల వైపు వస్తోంది. జూరాలకు ఇన్‌ఫ్లో 62 వేల క్యూసెక్కులు ఉండగా మూడు గేట్ల ద్వారా 18,384 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 45,055 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర నుంచి సుంకేసుల డ్యామ్‌కు 10 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 6 వేల క్యూసెక్కులను శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

లక్ష్మారెడ్డి తల్లి దశదినకర్మలో పాల్గొన్న ప్రముఖులు



మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి తల్లి లక్ష్మమ్మ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

తిమ్మాజిపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి తల్లి దశదినకర్మలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు పలువురు జిల్లా, మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొని నివాళులర్పించారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మాతృమూర్తి లక్ష్మమ్మ ఈనెల 1న హైదరాబాద్‌లో చనిపోవడంతో ఆమె స్వగ్రామమైన తిమ్మాజిపేట మండల పరిధిలోని ఆవంచ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఆవంచలో నిర్వహించిన దశదినకర్మలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వరరెడ్డి, రాజేందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి ఆమె చిత్ర పటానికి నివాళులర్పించి మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని పరామర్శించారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి, యాదయ్య, శ్రీశైలం యాదవ్, మాజీ జడ్పీటీసీ దయాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు వేణుగోపాల్‌గౌడ్, అజయ్‌కుమార్, మోహనాచారి, స్వామి, ఇబ్రహీం, సైఫ్, ఉషన్న, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

● తెలంగాణ విద్యామండలి చైర్మన్ డాక్టర్ వి.బాలకిష్టారెడ్డి



జయప్రకాష్ నారాయణ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వి.బాలకిష్టారెడ్డి, కేఎస్ రవికుమార్ తదితరులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : లోక్‌నాయక్ భారతరత్న జయప్రకాష్ నారాయణ్ దేశంలో సాంకేతిక రంగాభివృద్ధికి ఎంతగానో కృషిచేసిన మహోన్నత వ్యక్తి అని, ఆయన సేవలు ఎన్నటికీ మరువ లేనివని తెలంగాణ విద్యామండలి చైర్మన్ డాక్టర్ వి.బాలకిష్టారెడ్డి అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జయప్రకాష్ నారాయణ్ ఇంజనీరింగ్ కళాశాలలో 123వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కళాశాలలో గల జయప్రకాష్ నారాయణ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని చైర్మన్ కేఎస్ రవికుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ప్రపంచంలో పోటీతత్వం బాగా పెరిగిందని, అవకాశాలను అంది పుచ్చుకునేందుకు విద్యార్థులు నైపుణ్యాలపై దృష్టి సాధించాలన్నారు. కళాశాల చైర్మన్ కేఎస్ రవికుమార్ మాట్లాడారు. కళాశాల కార్యదర్శి వెంకట రామారావు, ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.కృష్ణమూర్తి, డాక్టర్ చంద్రశేఖర్, కోటాల సందీప్‌కుమార్, పాలమూరు బ్లడ్ బ్యాంక్ కార్యదర్శి బాలయ్య, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సమాచార హక్కు చట్టం కార్యక్రమంలో వి.బాలకిష్టారెడ్డి విద్యార్థులకు చట్టం గురించి వివరించారు.

క్రైం కార్నర్

గల్లంతైన భార్యాభర్తల మృతదేహాలు లభ్యం

» కిష్టారం గ్రామ సమీపంలోని పోతిరెడ్డి చెరువు అలుగు నీటిలో గల్లంతు

» మూడవ రోజు తేలిన మృతదేహాలు

జడ్చర్ల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం కిష్టారం, అంబటాపురం గ్రామాల మధ్య దారిపైకి పోతిరెడ్డి చెరువులో నుంచి వచ్చిన అలుగు నీళ్లలో గల్లంతైన భార్యా భర్తలు తానెం బాలయ్య, తానెం రాములమ్మల మృతదేహాలు శనివారం లభ్యమయ్యాయి. ఈ నెల 9న కిష్టారం గ్రామం నుంచి స్వంత గ్రామమైన అంబటాపుర్‌కు నడుచు కుంటూ వెళ్తున్న వీరు, అలుగు పారుతున్న నీటిలో గల్లంతయ్యారు. సంఘటన స్థలానికి జడ్చర్ల ఫైర్‌స్టేషన్ సిబ్బందితో పాటు జిల్లా కేంద్రంలోని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం 36గంటల పాటు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన ప్రాంతం నుంచి దాదాపు కిలోమీటరు దూరంలో భార్యాభర్తల బాలయ్య, రాములమ్మల మృతదేహలు లభ్యమయ్యాయి. మృతదేహలను నీళ్లలో నుంచి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు మైదానం ప్రాంతానికి తీసుకువచ్చారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పరామర్శ

పోతిరెడ్డిచెరువు అలుగు నీటిలో గల్లంతై మృతిచెందిన తానెం బాలయ్య, రాములమ్మల కుటుంబ సభ్యులను శనివారం జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి పరామర్శించారు. భారీ వర్షాల కారణంగా ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీటిలో గల్లంతైన భార్యాభర్తలు ఇద్దరు మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులను పరామర్శించి, రూ.50వేల ఆర్థికసహాయం అందచేశారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని, త్వరలోనే బీటీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

తిమ్మాజిపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల కేంద్రంలోని మద్యం డిపో సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నేరేళ్లపల్లి ఆంజనేయులు(45)అనే వ్యక్తికి గాయాలయ్యాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... తిమ్మాజిపేట నుంచి బైకుపై మారేపల్లి వెళ్తున్న ఆంజనేయులును మారేపల్లికాలనీకి చెందిన కందిషౌరెడ్డి తన బైకుపై వెళ్తూ అకస్మాత్తుగా రెండు బైకులు ఢీకొట్టుకోవడంతో బల్ల ఆంజనేయులుకు బలంగా గాయాలయ్యాయి. అదే మార్గంలో వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మారేపల్లి గ్రామ నివాసి దోమ వెంకటేశ్ పరిస్థితులను గమనించి గాయాలైన ఆంజనేయులును వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యం అందించేందుకు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి మెరుగైన వైద్యంకోసం తన సొంతకారులో పంపించారు.

ఉరివేసుకొని రైతు ఆత్మహత్య

నవాబ్‌పేట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): చేసిన అప్పులు తీర్చలేక ఓ రైతు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని ఎర్రవాడ్కతండాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విక్రం కథనం ప్రకారం... మండలంలోని వెంకటేశ్వర గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్రవాడ్క తండాకు చెందిన పాండు భార్య పిల్లలతో కలిసి బతుకుదెరువు కోసం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఉంటున్నారు. ఈనెల 10న ఇంటికి వెళ్లివస్తానని సాయంత్రం 3 గంటలకు పాండు బయలు దేరాడు. ఇదిలా ఉంటే, శనివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో గ్రామానికి చెందిన గోపాల్ అనే వ్యక్తి ఫోన్ ద్వారా పాండు గ్రామ సమీపంలోని వీరాపూర్ మల్లయ్య వ్యవసాయ పొలంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులకు చెప్పాడు. దీంతో అక్కడికి వచ్చిన కుటుంబ సభ్యులు మృతదేహన్ని ఇంటికి తరలించారు. భార్య మంగమ్మ తన భర్త అప్పులతోనే ఆత్మహత్య చేసుకున్నాడని, ఎవరిపై అనుమానం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


శంకరయ్య (ఫైల్)

గోపాల్‌పేట, అక్టోంబరు 11 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై నుంచి కిందపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బుద్ధారం గ్రామనికి చెందిన వడ్డె శంకరయ్య (35) మండలంలో తాపీమేస్త్రీగా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా డు. గత నెల 29న సాయంత్రం రేవల్లి మండలంలోని కేశంపేట గ్రామంలో మేస్త్రి పని ముగించుకొని వస్తుండగా, మధ్య మార్గంలో బైక్‌పై నుంచి కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. ఆరోగ్యం విషమంగా ఉండటంతో శంకరయ్యను చికిత్స కోసమని హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రితో చేర్పించారు. 12 రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం రా త్రి మృతి చెందాడు. శనివారం మృతదేహని స్వగ్రామానికి తీసుకవచ్చారు. మృ తుడు శంకరయ్యకు భార్య పద్మ, నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. ప్రభుత్వం మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రావణ్ కుమార్ పరామర్శించి ఆర్థిక సాయం చేశారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు..


మృతి చెందిన పాడిఆవు

వెల్దండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని అల్లంతోటబావి తండాలో ఇస్లావత్ జైపాల్ అనే రైతుకు చెందిన పాడిఆవు విద్యుత్ ప్రమాదంలో మృతి చెందింది. జైపాల్‌కు చెందిన పాడిఆవు తన వ్యవసాయ పొలంలో మేస్తుండగా కిందపడిన విద్యుత్ వైరు తగిలి మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.లక్షా 20వేలు ఉంటుందని ఈ సందర్భంగా బాధిత రైతు తెలిపారు.

జాతీయ రహదారిపై తప్పిన పెను ప్రమాదం

అలంపూర్ చౌరస్తా, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్ 44వ జాతీయ రహదారిపై శనివారం ఒకేసారి మూడు వాహనాలు ఒకదాని వెనుక మరొకటి ఢీకొన్న సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండవెల్లి మండల పరిధిలోని ఉత్తరఫుడ్స్ వద్ద శనివారం కర్నూలు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న టీఎస్ ఇన్నోవా కారు ఉత్తర ఫుడ్స్ వద్దకు రాగానే కుక్క అడ్డుగా రావడంతో సడన్ బ్రేకు వేశాడు. అదే వరుసగా మరో నాలుగు కార్లు ఒక గూడ్స్ లారీ వెన్నంటే వస్తుండటంతో ఢీకొన్నాయి. ఈ తప్పిన పెను ప్రమాదంలో ఎవరికి కూడా గాయాలు కాలేదు. పెను ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

మహిళను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు

వడ్డేపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మహిళను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు అయిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల పరిధిలోని తనగల గ్రామంలో చోటుచేసుకున్నది. తనగల నుంచి శనివారం చాకలి సత్యమ్మ తన సొంత గ్రామమైన చిన్నధన్వాడ గ్రామానికి నడుచుకుంటూ బయలేరింది. కాగా, మార్యమధ్యంలో తనగల గ్రామానికి చెందిన తిమ్మప్ప అనే వ్యక్తి ఆమెను చూసి సైగలు చేశాడు. దీంతో ఆమె నిలదీయగా కోపోద్రిక్తుడైన అతడు తన దగ్గర ఉన్న చర్నకోలుతో ఆమెను విక్షణరహితంగా కొట్టాడు. ఈ విషయంపై సత్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ట్లు శాంతినగర్ ఎస్‌ఐ నాగశేఖర్ రెడ్డి తెలిపారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా పండుగ

» ఉమ్మడి జిల్లాలో ఒక జాతీయ, ఎనిమిది రాష్ట్రస్థాయి టోర్నీలకు ఆతిథ్యం

» రాజాపూర్‌లో ఈ నెల 18 నుంచి స్టేట్ వాలీబాల టోర్నీ


గత ఏడాది నిర్వహించిన జాతీయస్థాయి అండర్-17 హ్యాండ్‌బాల్ టోర్నీ ప్రారంభ వేడుకలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు అతిథ్యం ఇవ్వడంలో ప్రత్యేక స్థానం ఉంది. తెలంగాణ రాష్ట్రంలోనే మహబూబ్‌నగర్ జిల్లా క్రీడా పోటీల నిర్వహణ అంటే వివిధ జిల్లాల క్రీడాకారుల్లో ఉత్సాహం ఉంటుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు ఈ ఏడాది ఒక జాతీయ స్థాయి, 8 రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా టోర్నీలను కేటాయించారు. ఇప్పటికే మండల, జిల్లా, ఉమ్మడి జిల్లా ఎంపికలను ఎంతో ఉత్సాహం నిర్వహించారు. పలు జిల్లాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ టోర్నీలో ఉమ్మడి జిల్లా జట్లు వివిధ క్రీడా అంశాల్లో పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా అండర్-14, 17, 19 జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణ చేపట్టనున్నారు. జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించారు. గత ఏడాది జాతీయస్థాయి అండర్-19 ఎస్‌జీఎఫ్ వాలీబాల్ బాలుర టోర్నమెంట్, ఈ ఏడాది జనవరిలో జాతీయ స్థాయి అండర్-17 విభాగంలో బాల, బాలికల హ్యాండ్‌బాల్ టోర్నీలను విజయవంతంగా నిర్వహించారు.

టోర్నీలను విజయవంతంగా నిర్వహిస్తాం



మహబూబ్‌నగర్ జిల్లాకు ఈసారి మూడు రాష్ట్రస్థాయి టోర్నీలతో పాటు ఒక జాతీయ స్థాయి క్రీడా టోర్నీ కేటాయించారు. టోర్నీలను పీడీ, పీఈటీల సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తాం. ఇప్పటికే ఉమ్మడి జిల్లా జట్లు రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొంటున్నాయి.

- డాక్టర్ శారదాబాయి, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ

ఈ ఏడాది 9 టోర్నీల కేటాయింపు...

ఈ ఏడాది జిల్లాలో 69వ జాతీయస్థాయి అండర్-17 ఎస్‌జీఎఫ్ బాల, బాలికల టోర్నీతో పాటు అండర్-14, 17, 19 విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణ చేపట్టనున్నారు. మొత్తం 9 టోర్నీలు ఉమ్మడి జిల్లాకు కేటాయించారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో..

మహబూబ్‌నగర్ జిల్లాలో అండర్-17 బాలికల వాలీబాల్ టోర్నీ ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు రాజాపూర్ మండలం తిరుమలపూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించనున్నారు. అండర్-17 బాల,బాలికల విభాగంలో క్రికెట్ టోర్నీ, అండర్-19 బాల,బాలికల విభాగంలో హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి టోర్నీలు కేటాయించారు.

నాగర్‌కర్నూల్ జిల్లాలో..

నాగర్‌కర్నూల్ జిల్లాకు అండర్-19 బాల, బాలికల మల్కం రాష్ట్రస్థాయి టోర్నీ నిర్వహించనున్నారు.

నారాయణపేట జిల్లా...

నారాయణపేట జిల్లాకు అండర్-19 బాల,బాలికల రెజ్లింగ్ రాష్ట్రస్థాయి టోర్నీ, అండర్-14 బాల,బాలికల హ్యాండ్‌బాల్ స్టేట్ టోర్నీలు కేటాయించారు.

జోగులాంబ గద్వాల...

జోగుళాంబ గద్వాల జిల్లాకు అండర్-14 బాల,బాలికల బీచ్‌వాలీబాల్ రాష్ట్రస్థాయి టోర్నీ కేటాయించారు.

వనపర్తి జిల్లాకు...

వనపర్తి జిల్లాకు అండర్-17 బాల, బాలికల రాష్ట్రస్థాయి హాకీ టోర్నీకి అతిథ్యం ఇవ్వనుంది.

ప్రమాదవశాత్తు నీట మునిగి ఇద్దరు సోదరుల మృతి

» చెక్‌డ్యామ్ నీటిలో ప్రమాదం, బలీదుపల్లిలో తీవ్ర విషాదం



నీట మునిగి మృతి చెందిన మంద సుధాకర్,మందసాయి (ఫైల్)

మూసాపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లి చెక్‌డ్యామ్ నీటిలో ప్రమాదవశాత్తు మునిగిపోయి ఇద్దరు సోదరులు మృతి చెందిన సంఘటన శనివారం మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం బలీదుపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం వివరాల్లో వెళ్లగా బలీద్‌పల్లి గ్రామానికి చెందిన మంద యాదయ్య, మంద మనెమ్మ దంపతులకు నలుగురు కుమారులు. అందరూ హైదరాబాద్‌లో స్థిరపడి ఆటో నడిపించేవారు. శుక్రవారం తల్లి మంద మనెమ్మ సంవత్సరీకం కోసం గ్రామానికి వచ్చారు. శనివారం తల్లి మొదటి సంవత్సరీకానికి సంబంధించిన పువ్వులను గంగలో కలపడానికి గ్రామ శివారులో ఉన్న చెక్‌డ్యామ్ వద్దకు కుటుంబ సభ్యులందరూ వెళ్లారు. అక్కడ కార్యక్రమాలు పూర్తిచేశాక పెద్ద కుమారుడు మంద సుధాకర్(32)కు చేపలు కన్పించడంతో పట్టుకోవడానికి నీటిలోకి దుకాడు. నీటి ప్రవాహ ఉధృతి తీవ్రం కావడంతో మునిగిపో తుండాన్ని గమనించిన సోదరుడు మంద సాయి (27) రక్షించడానికి నీటిలోకి దూకాడు. అన్నను పట్టుకోవడానికి ప్రయత్నించగా అతడు కూడా మునిగిపోతుండగా మరో సోదరుడు పంచేను నీటిలోకి విసిరి వారిని బయటికి లాగి ఒడ్డుపైకి చేర్చాడు. అప్పటికే మంద సుధాకర్ మృతి చెందగా మంద సాయి పరిస్థితి విషమించడంతో ఇద్దరినీ జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మంద సాయి కూడా మృతి చెందాడు. కళ్ల ముందే తమ ఇద్దరు కుమారులు మృతి చెందడాన్ని చూసి తండ్రి యాదయ్యతో పాటు కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడు మంద సుధాకర్‌కు భార్య మమత, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మంద సాయికి వివాహం కాలేదు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

పేటలో ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు



పథ సంచాలన్ చేస్తున్న కార్యకర్తలు, కార్యకర్తలపై పూలు చల్లి స్వాగతం పలుకుతున్న మహిళలు

» ఆకట్టుకున్న పథ సంచాలన్

» అడుగడుగునా పూలు చల్లి అఖండ స్వాగతం

» సమరసత నిర్మాణమే సంఘ లక్ష్యం

» సంస్కార భారతి ప్రాంత సహకారదర్శి చక్రవర్తి వేణుగోపాల్

నారాయణపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కేంద్రంలో శనివారం ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పూర్తి గణవేష్‌తో వేలాది మంది కార్యకర్తలు పథ సంచాలన్ (శోభాయాత్ర) పళ్ల హనుమాన్ మందిరం నుంచి శ్రీ గార్డెన్ వరకు నిర్వహించారు. శోభాయాత్రలో సంఘ కార్యకర్తలపై మహిళలు, స్నేహ మిత్ర మండలి సభ్యులు, వివిధ సంఘాల కార్యకర్తలు పూలు చల్లి ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ గార్డెన్‌లో జరిగిన సభలో ప్రధాన వక్త సంస్కార భారతి ప్రాంత సహకారదర్శి చక్రవర్తి వేణుగోపాల్ మార్గదర్శనం చేస్తూ దేశంలో సమరసత భావన నెలకొల్పడమే సంఘం ప్రధాన లక్ష్యం అన్నారు. వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణం చేయడమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ జన్మ శతాబ్దిలో భాగంగా రాబోయే రోజులలో ఇంటింటి జన జాగరణ చేపట్టబోతుందని తెలిపారు.

వరలక్ష్మి సరోజ, నగర సంఘ చాలక్ డాక్టర్ మదన్‌మోహన్ రెడ్డితో పాటు స్వయం సేవకులు పాల్గొన్నారు. ముదిరాజ్ సంఘం, స్నేహ మిత్ర మండలి, బలరామ రైతు సంఘం ఘన స్వాగతం పలికారు. రాష్ట్రీయ స్వయం సేవక సంఘ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పథ సంచాలన్ పాల్గొన్న స్వయం సేవకులకు నారాయణపేట ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మెయిన్ చౌక్ వద్ద అలాగే భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో సత్యనారాయణ చౌరస్తాలో పూలతో స్వాగతం పలికారు.

సైబర్ ఉచ్చులో 12.50లక్షలు మాయం

» నాగర్‌కర్నూల్‌లో చోటు చేసుకున్న ఘటన

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : సైబర్ మాయగాళ్ల ఉచ్చులో పడి నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన శెట్టిపల్లి తిరుపతయ్య 12లక్షల 50వేలు అపహరణకు గురయ్యాయని ఎస్‌ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎర్రగడ్డ కాలనీకి చెందిన శెట్టిపల్లి తిరుపతయ్య ఫోన్ వాట్సాప్‌గ్రూప్‌లో ట్రేడింగ్ యాప్‌లో డబ్బులు జమ చేస్తే తక్కువ సమయంలో రెట్టింపు అవుతాయని మేసేజ్ వచ్చింది. దీంతో అతను ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని 12లక్షల 50వేల రూపాయలు జమ చేశాడు. ఆ తర్వాత ఆ యాప్ ఓపెన్ చేసేందుకు ప్రయత్నించగా, కాలేదు. ఆగస్టు 13వ తేదీ వరకు యాప్ నడిచింది. ఆ తర్వాత యాప్ లాక్ కావడంతో సైబర్ క్రైమ్‌లో 1930కు ఫిర్యాదు చేశాడు. దీంతో శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శెట్టిపల్లి తిరుపతయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

జిమ్‌లో దాడి చేసిన నలుగురు యువకులపై కేసు

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి ప్రధాన రహదారిలో ఉన్న ఒక జిమ్‌లో యువకులపై దాడి చేసిన సంఘటనలో నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. వివరాల ప్రకారం.. కర్నాటక రాష్ట్రానికి చెందిన ఆండ్రెస్ శుక్రవారం రాత్రి అకారణంగా కార్తీక్, అతని స్నేహితులు తరుణ్, కౌశిక్, షరీఫ్‌లతోపాటు మరికొంతమంది దాడి చేశారని ఆండ్రెస్ ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనపై నలుగురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నెమళ్లకు అస్వస్థత

» కాపాడిన రైతుకు సత్కారం


నెమళ్లను కాపాడిన రైతును సన్మానిస్తున్న పోలీసులు, గ్రామస్థులు

గోపాల్‌పేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలో నెమళ్లు అస్వస్థతకు గురయ్యాయి. ఎస్‌ఐ నరేష్ కుమార్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఏదుట్ల గ్రామ పరిధిలో ఉన్న నడిపి గుట్ట దగ్గర గ్రామానికి చెందిన శివ పొలంలో శుక్రవారం రాత్రి పంటలకు పిచికారి చేసే క్రిమిసంహారక నీళ్లు తాగిన నాలుగు నెమళ్లు అస్వస్థతకు గురై నడవలేని పరిస్థితిలో ఉండిపోయాయి. గమనించిన సదరు రైతు సంబంధిత అధికారులకు సమాచారం అందించే ప్రయత్నం చేసినా ఎవరూ అందుబాటులోకి రాలేదు. దీంతో నెమళ్లను తన దగ్గరే భద్రపరిచాడు. విషయం తెలుసుకున్న ఎస్పీ గిరిధర్‌రావు శనివారం తెల్లవారుజామున పోలీసులకు సమాచారం అందించారు. తక్షణమే ఎస్‌ఐ నరేష్ కుమార్, గ్రామ యువకులు అక్కడికి చేరుకొని నడవడానికి ఇబ్బంది పడుతున్న మూడు నెమళ్లను స్వాధీనం చేసుకొని మండల కేంద్రంలో వెటర్నరీ డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో జిల్లా కేంద్రం పశువైద్యశాలకు తీసుకవెళ్లి అక్కడ వాటికి చికిత్స అందించి ఫారెస్టు అధికారులకు అందజేశామని ఎస్‌ఐ తెలిపారు. నెమళ్లను ఎస్పీ వాటిని పరిశీలించి డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. నెమళ్లను కాపాడిన రైతు శివను పోలీసులు, గ్రామస్థులు శాలువాతో సత్కరించారు.

150 దేశాల్లో వ్యాపించిన సత్యసాయి ఆధ్యాత్మిక సామ్రాజ్యం

» పుట్టపర్తి సత్యసాయి సెంట్రల్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జే.రత్నాకర్

కల్వకుర్తి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ సత్యసాయి ఆధ్యాత్మిక సామ్రాజ్యం 150దేశాల్లో వ్యాపించిందని సత్యసాయి సెంట్రల్ మేనేజింగ్ ట్రస్టు పుట్టపర్తి ఆర్‌జే.రత్నాకర్ అన్నారు. డబ్బు కాదు సేవే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణ భగవాన్ సత్యసాయి సేవాసమితి, ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన ప్రశాంతి సన్నిదిలో భగవాన్ సాయిబాబా, షిరిడి సాయిబాబా, లక్ష్మీగణపతి, గాయత్రీ మాత అన్నపూర్ణా మాత గోపాలకృష్ణ దశావతార మూర్తుల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు శనివారం అట్టహసంగా జరిగాయి. కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, పుట్టపర్తి సత్యసాయి సెంట్రల్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే. రత్నాకర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్వకుర్తి ప్రాంతంలో విద్యాభివృద్ధికి శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు సహకరించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఉమా మనీలా సంజీవ్‌కుమార్‌యాదవ్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, వెల్దండ మాజీ సర్పంచ్ ఎన్నం భూపతిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డి, నాయకులు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, సత్యసాయి సేవా సంస్థల నాయకులు శంకరయ్య, వెంకట్రావు, సురేష్, సభ్యులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

డ్రగ్స్ నిర్మూలన కోసం అహర్నిశలు కృషి

- కృష్ణదేవ, ఎస్‌ఐ, ఊర్కొండ



ఊర్కొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ నిర్మూలన కోసం అహర్నిషలు కృషి చేస్తున్నామని ఎస్‌ఐ కృష్ణదేవ అన్నారు. ప్రతీ గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు.

డ్రగ్స్ అంటే ఏమిటీ ?

డ్రగ్స్ అంటే సాధారణంగా శరీరానికి హాని కలిగించే మత్తు పదార్థాలు. వీటిని మాదకద్రవ్యాలు అని కూడా అంటారు. గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటివి తీసుకునే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

మాదకద్రవ్యాల నిర్మూలన కోసం యువతి, యువకులకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాము. వాటి వల్ల కలిగే అనర్థాలను జానపద గేయాలు, జానపద కళాకారుల ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నాం.

మండలంలో డ్రగ్స్ సరఫరా చేసే వారిపై, తీసుకుంటున్నా వారిపై ఏమైనా కేసులున్నాయా ?

మండలంలో ఇప్పటి వరకు ఒకే కేసు నమోదైంది. అది కూడా బయటి రాష్ట్రానికి చెందిన వ్యక్తిపై. ప్రస్తుతం మన మండలంలో అలాంటి పరిస్థితి లేదు. మాదకద్రవ్యాలు ఎక్కడా సరఫరా కావడంలేదు. ఎక్కడైనా ఉంటే మాకు సమాచారం ఇస్తే, వారి పేరు గోప్యంగా ఉంచుతాం.

న్యూస్ బాక్స్

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మాజీ సర్పంచ్



ఎంపీ, స్థానిక ఎమ్మెల్యేతో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మాజీ సర్పంచ్ ప్రశాంత్‌నాయక్

చారకొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) మండలంలోని అగ్రహారంతండా తాజా మాజీ సర్పంచ్ ప్రశాంత్‌నాయక్ శనివారం హైదరాబాద్‌లో నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, అచ్చంపేట శాసనసభ్యుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణతో కలిసి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని సిరసనగండ్ల పంచాయతీలోని అయోధ్యనగర్ ఏకశిల (గుట్ట)పై రెండవ అపరభద్రాద్రిగా వెలిసిన సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, ఆలయ భూములు సాగుచేస్తున్న రైతులకు హక్కులు కల్పించి పట్టాపాసు పుస్తకాలు జారీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు మాజీ సర్పంచ్ ప్రశాంత్ నాయక్ తెలిపారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం



చంద్రకల్‌లో బండి స్రవంతిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకుడు బండి సాయిబాబు

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చంద్రకల్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన మేస్త్రి బండి వెంకటస్వామి కూతురు బండి స్రవంతి నీట్ ఫలితాల్లో 5,496వ ర్యాంక్ సాధించింది. మొదటి ఫేజ్‌లో భూపాలపల్లి జిల్లా మెడికల్ కాలేజ్‌లో సీటు సాధించిన స్రవంతిని శనివారం గ్రామంలో స్థానికులు ఘనంగా సన్మానించారు. తండ్రి మేస్త్రీ పని చేసుకుంటూ చదివించాడని కాంగ్రెస్ పార్టీయువ నాయకుడు బండి సాయిబాబు అన్నారు. గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామస్థులు బాలకృష్ణ, హరి కృష్ణ, రామస్వామి, పాల్గొన్నారు.

'లో వోల్టేజీ సమస్య పరిష్కరించాలి'

ఉప్పునుంతల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొరటికల్ గ్రామంలో లో వోల్టేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు మూడు నెలలుగా గ్రామంలో లో వోల్టేజీ విద్యుత్ సరఫరాతో విలువైన గృహోపకరణాలు కాలిపోతున్నాయని పలువురు వాపోతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు విద్యుత్ అధికారులకు గ్రామస్థులు చెప్పినా ఫలితం లేకపోయిందని పలువురు ఆరోపిస్తున్నారు. రాత్రివేళల్లో విద్యుత్ లైట్లు దీపంలా వెలుగుతున్నాయని, ఫ్యాన్లు చిన్నగా తిరగడంతో దోమల బెడద ఎక్కువైపోతుందని, దోమ కాటుకు రోగాలబారిన పడుతున్నామని పలువురు తెలిపారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి గ్రామంలో అవసరం ఉన్న చోట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి గ్రామంలో లో వోల్టేజీ సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎన్నాళ్లీ అద్దె కష్టాలు ?

- కోడేరులో అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు
- అవస్థలు పడుతున్న అధికారులు, ప్రజలు

కోడేరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : నలభై ఏళ్ల క్రితం మండల కేంద్రంగా ఏర్పడిన కోడేరులో ఇప్పటికీ చాలా ప్రభుత్వ కార్యాలయాలు సొంత భవనాలకు నోచుకోలేదు. కొన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాల కోసం నిధులు మంజూరైనందున నిర్మాణ పనులు మొదలుపెట్టారు. వాటిల్లో కూడా అధికారుల తప్పిదం వల్ల మండల రెవెన్యూ కార్యాలయం పనులు అర్థాంతరంగా ఆగిపోయాయి. రెవెన్యూ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. ప్రభుత్వ కార్యాలయాలకు స్థలంతో పాటు నిధులు కూడా మంజూరైనా భవనాలు పూర్తి కాక అద్దెభవనాల్లో కొనసాగుతూ ప్రభుత్వ ఆదాయానికి నెలనెలా రూ. వేలల్లో గండిపడుతోంది. మండలంలో రెవెన్యూ కార్యాలయంతో పాటు మండల మహిళా సమాఖ్య భవనం, ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహం అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మండల మహిళా సమాఖ్య భవనం పిల్లర్లతో పాటు స్లాబ్ వేసి గోడలు కట్టి మధ్యలో ఆగింది. బీసీ బాలుర వసతి గృహం పిల్లర్లు, బేసు వరకు పూర్తై మధ్యలో నిలిచి పోయింది. ఈ భవనాల కోసం ఒక సర్వే నెంబర్ భూమిని ఎంపిక చేస్తే, మరో సర్వే నెంబర్‌లో నిర్మాణం పనులు చేపట్టారని ఫిర్యాదుల మేరకు అర్థాంతరంగా నిలిచిపోయాయి. ప్రభుత్వ వెటర్నరీ హాస్పిటల్ పాత గ్రామ పంచాయతీ కార్యాలయం కొనసాగుతోంది. వర్షానికి నీరు లీకై మందులు నిల్వ చేయడానికి కూడా అవకాశం లేదు. బీసీ బాలుర వసతి గృహంలో ఇరుకు గదుల వల్ల విద్యార్థులు చదువుకోవడానికి సౌకర్యంగా లేదు. రాత్రి పూట నిద్రించడానికి కూడా జాగలేక ఒకే రూమ్‌లో 20 మంది దాకా ఉన్నామని విద్యార్థులు తెలి పారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాలకు భవ నాలు పూర్తి చేసి ప్రజల సౌకర్యార్థం ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న మండల మహిళా సమాఖ్య భవనం



అద్దె భవనంలో తహసీల్దార్ కార్యాలయం

భవనాలను పూర్తి చేయాలి



తహసీల్దార్ కార్యాలయం, మండల మహిళా సమాఖ్య, బీసీ బాలుర వసతిగృహం అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.అద్దెభవనాలకు అద్దె చెల్లించినా అరకొర వసతులతో అధికారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతి నిధులు స్పందించి తప్పులను సరి చేసి ప్రభుత్వ భవనాలను పూర్తి చేయాలి.

- కె.బాల్‌రెడ్డి, తీగలపల్లి

42 శాతం బీసీ రిజర్వేషన్లకు సహకరించని ..

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి



కల్వకుర్తిలో ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

- సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు

కల్వకుర్తి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలుకు వ్యతిరేకంగా ఉన్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గం పర్వతాలు అన్నారు. శనివారం కల్వకుర్తిలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలు జీవోతో పాటు స్థానిక సంస్థల నిర్వహణపై హైకోర్టు స్టే విధించడంతో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోవడానికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వమేనని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ మైనార్టీ మహిళల హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు సాధించుకోవడానికి ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్. శ్రీనివాస్, బి.ఆంజనేయులు, సి.ఆంజనేయులు, సీనియర్ నాయకులు ఏపీ మల్లయ్య, బాలస్వామి, శంకర్‌నాయక్, శి వవర్మ, నాయకులు మధు, రాములు పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ మోసం



వంగూరులో అంబేద్కర్, పూలే విగ్రహాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

- బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు


వంగూరు, అక్టోబరు11 (ఆంధ్రజ్యో తి) : బీసీల 42 శాతం రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ మోసం చేసిందని బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాసులు విమర్శించారు. శనివారం వంగూరులోని అంబేద్కర్, పూలే విగ్రహాల వద్ద బీసీ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బీసీలను మభ్యపెట్టేందుకే జీవో తెచ్చారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక చేత్తో రిజర్వేషన్లు ఇచ్చి, మరో చేత్తో లాక్కుందని ధ్వజమెత్తారు. బీసీలను మోసగించడమేనని ధ్వజమెత్తారు. బీసీలు ఇక రాజ్యాధికారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో రమేష్‌చారి, సాయన్న, శీనివాస్, గణేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

- ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి

తిమ్మాజిపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చిలుక సురేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అప్పాజీపల్లి శివారులో నరసన్నగుట్టపై స్వయంభుగా వెలిసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం అమ్మవార్లకు శ్రీఆంజనేయ స్వామి, లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించి భక్తుల సౌకర్యార్థమై వసతి గదులతో పాటుగా భోజనశాల ఏర్పాటు చేయిస్తామన్నారు. అంతకు ముందు వేద పండితులు గంగాధర శర్మ, హరిశర్మలు బ్రహ్మకమలములచే అలంకరించిన లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి అష్టోత్తర శతనామావళి పఠించి సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తుల గోత్రనామాలు చదివి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

ఇ-అన్నదాత క్యాంటీన్‌తో రైతులకు మేలు



అవగాహన కల్పిస్తున్న జిల్లా కో ఆర్డినేటర్ ఫెర్రీ రాయ్

- జిల్లా కో ఆర్డినేటర్ ఫెర్రీ రాయ్

లింగాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : సేవ్ ఎర్త్ మిషన్ ఆధ్వర్యంలో ఇ-అన్నదాత వారి సహకారంతో ఇ-అన్నదాత క్యాంటీన్‌లో నిత్యావసర సరుకులు, గ్రోసరీ ఐటమ్స్ 50శాతం సబ్సిడీతో ఇవ్వనున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్ ఫెర్రీరాయ్, మండల ఇన్‌చార్జ్ సుధాకర్‌గౌడ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఇ-అన్నదాత క్యాంటీన్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలో ఇ-అన్నదాత క్యాంటీన్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇ-అన్నదాత క్యాంటీన్‌లో రైతులందరికీ వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, ఎరువులు అందించనున్నట్లు తెలిపారు. వడ్డీ లేకుండా ముద్ర లోన్స్ మంజూరు చేయ నున్నట్లు పేర్కొన్నారు. ఇ-అన్నదాత క్యాంటీన్ ఏజెంట్ లింగాల, అచ్చంపేట ఇ-అన్నదాత క్యాంటీన్ ఏజెంట్ కల్యాణ్, వివిధ మండలాల ఇన్‌చార్జీలు శ్రీకాంత్, నాగరాజు, ప్రభాకర్, బాలస్వామి పాల్గొన్నారు.



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

దర్గాలో ఎమ్మెల్యే ప్రార్థనలు

వెల్దండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం సమీపంలో హైదరాబాద్ - శ్రీశైలం ప్రధానరహదారిపై ఉన్న దర్గావద్ద శనివారం ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాతియాల సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్‌కుమార్, రషీద్, భూపతి రెడ్డి, సంజీవ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సోమవారం నుంచి ప్రజావాణి

- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కొనసాగుతున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఈనెల 13వ తేదీ నుంచి యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడం వల్ల తాత్కాలికంగా ప్రజావాణి కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు గుర్తు చేశారు.

నేడు ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం

నాగర్‌కర్నూల్‌టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా కార్యవర్గ సమావేశంలో ఈ రోజు జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీధర్‌రావు తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.రవి, ప్రధాన కార్యదర్శి సదానం దగౌడ్, రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎం.పర్వత్ రెడ్డి, సంఘం ఎన్నికల అధికారులు శ్రీనివా సరావు, వైకరుణాకర్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

కారు ఢీ కొని బాటసారి దుర్మరణం

కల్వకుర్తి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ బాటసారి కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి కల్వకుర్తి పట్టణంలో చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. వెల్దండ మండలం కొట్ర గ్రామానికి చెందిన నారుమళ్ల వెంకటయ్య (46) శనివారం రాత్రి తన గ్రామానికి రవాణా సౌకర్యం లేకపోవడంతో ఒంటరిగా నడుచుకుంటూ వస్తున్నాడు. కల్వకుర్తి పట్టణంలోని వడ్డెర బస్తీ కాలనీలో మైసమ్మ ఆలయం వద్ద హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణమైన కారును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మృతదేహాన్ని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అభయుడి సన్నిధిలో సామూహిక వ్రతాలు



ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయంలో సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

ఊర్కొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తులు సామూహిక వ్రతాలు నిర్వహించారు. అర్చకులు స్వామివారికి తెల్లవారుజామున అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. భక్తులు సామూహిక వ్రతాలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయం సిబ్బంది మారుతిరావు, వరలక్ష్మి, శ్రీశైలం, అర్చకులు దత్తాత్రేయ శర్మ, ప్రవీణ్‌శర్మ, మహేష్‌శర్మ, శ్రీనివాసశర్మ ఉన్నారు.

విద్యార్థులకు బెడ్‌షీట్లు పంపిణీ



బల్మూరులో బాలురకు బెడ్‌షీట్లు పంపిణీ చేస్తున్న వార్డెన్ కృష్ణయ్య

బల్మూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఉన్న వంద మంది విద్యార్థులకు ప్రభుత్వంచే సరఫరా అయిన బెడ్‌షీట్లు, కార్పొరేట్ స్పోర్ట్స్ షూస్ విద్యార్థులకు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆలేటి కృష్ణయ్య శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకుని బాగా చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వర్కర్లు, విద్యార్థులు తదిత రులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు నిరోధించాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకటేశ్‌గౌడ్

- ఎస్‌ఐ వెంకటేశ్‌గౌడ్
- ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

లింగాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా శనివారం లింగాల మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో కోనేరు స్వచ్ఛంద సంస్థ, పోలీస్ శాఖ కస్తూర్బా పాఠశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఎస్‌ఐ వెంకటేశ్ గౌడ్ మాట్లాడుతూ బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను, అనర్థాలను నివారించి వారి హక్కులను తెలియజేసేందుకు ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవాన్ని ప్రకటించిందన్నారు. మహిళల ఆత్మగౌరవం కాపాడడం కోసం పోరాటం చేసిన ఎలానార్ రూజ్‌వెల్ట్ పుట్టిన రోజైన అక్టోబరు 11న అంతర్జాతీయ బాలిక దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి గుర్తించిందని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలు (విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, హింస, బల వంతపు బాల్య వివాహం)పై వివక్షతపై అవగాహన పెంచడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో శారద, యాక్సిస్ టు జస్టిస్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఆంజనేయులు, మహిళ కానిస్టేబుళ్లు మంజుల, జ్యోతి, లీలాబాయ్, యాక్సెస్ టు జస్టిస్ ఏరియా కో ఆర్డినేటర్లు శ్రీనివాసులు, జాకీర్ హుస్సేన్, కల్పన, కానిస్టేబుల్ షేక్ కుద్దూస్, శివశంకర్, పాఠశాల ఉపాధ్యాయులు పరమేశ్వరి, ప్రవీల, అలివేల, రాధిక, లోకము జ్యోతి, రజిత, అనిత పాల్గొన్నారు.

పరిష్కారం కాని రెవెన్యూ సదస్సుల్లోని దరఖాస్తులు

- సీపీఎం మండల కార్యదర్శి రవి

కోడేరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో అనేక రైతుల సమస్యలు పరిష్కారం కాలేదని సీపీఎం మండల కార్యదర్శి పి.రవి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటీ పూర్తి చేయలేదని మండిపడ్డారు. రైతుల సమస్యలు తీర్చడానికి ధరణి వెబ్‌సైట్ తొలగించి భూమాత తీసుకు వచ్చారని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు రెవెన్యూ సదస్సుల్లో రైతులు పెట్టుకున్న దరఖాస్తులను పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటయ్య, వరప్రసాద్, వెంకటమ్మ, బుచ్చన్న, లక్ష్మయ్య, రవి పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతు చేపట్టాలి

పెంట్లవెల్లి (ఆంధ్రజ్యోతి) : పెంట్లవెల్లి నుంచి మంచాలకట్ట, మాధవస్వామినగర్ తదితర గ్రామాలకు వెళ్లే దారిలో పాడైన రోడ్లను మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి కురుమయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రతీ సంవత్సరం వేసవి కాలంలో కృష్ణానది నుంచి ఒండ్రుమట్టిని పెద్దపెద్ద ట్రక్కుల ద్వారా తరలించడంతో రోడ్లన్నీ చాలా వరకు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. గతంలో ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయని అన్నారు. అధికారులు రోడ్ల మరమ్మతులు చేపట్టాలని కోరారు.

బస్సు చార్జీలు తగ్గించాలి : సీపీఎం

వంగూరు (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ సిటీలో, జిల్లాల్లో స్పెషల్ బస్సుల పేరుతో పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి బాలస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వంగూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుచార్జీలను పెంచి సామాన్య ప్రజలపై భారం మోపిందన్నారు. కార్యక్రమంలో శివరాములు, ఆంజనేయులు పాల్గొన్నారు.

దళితులపై దాడి సంఘటనలో డీఎస్పీ విచారణ



పెద్దకార్పాములలో వివాదాస్పద భూముల్లో పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పెద్దకార్పాముల గ్రామంలో ఈనెల 6వ తేదీన సాగుభూముల విషయంలో ఓ వర్గానికి చెందినవారు దళితులపై దౌర్జన్యంగా దాడి చేసి గాయపర్చిన సంఘటనపై శనివారం నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్ విచారణ చేశారు. ప్రత్యర్థుల దాడిలో గాయపడిన దళిత కుటుంబాల వారి నుంచి డీఎస్పీ వాంగ్మూలాన్ని పంచుల సమక్షంలో రికార్డు చేసుకున్నారు. అనంతరం బాధితులను పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌కు రప్పించుకున్నారు. సంఘటనకు దారి తీసిన పరిస్థితులను గురించి ఆయన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఇదిలా ఉండగా పెద్దకార్పాముల శివారులో సీలింగ్ చట్టం ప్రకారంగా 1977లో సర్వే నెంబర్లు 15, 16, 17లో 16:30ఎకరాల భూమిని నిరుపేద దళితులకు రెవెన్యూ అధికారులు తమ పూర్వీకుల పేర పట్టాలు ఇచ్చారు. వారి మరణానంతరం వారి కుమారుల పేర్ల మీద 17మందికి భూములు పట్టాలు చేసుకున్నారు. ఈ భూముల తమవి అంటూ కొందరు బీసీ వర్గం వారు పట్టాదారులైన దళితుల్లో నిడిగొండ సిద్దార్థ, భార్య రేష్మ, పడాల మహేష్, కల్మారి బాల మశయ్య, వంశీతోపాటు మరో ఇద్దరిపై ఈ నెల 6వ తేదీన వ్యవసాయ క్షేత్రంలో దాడికి పాల్పడిన సంఘటన విదితమే. ఈ సంఘటనపై 12మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బాధితులు అదేరోజు పెద్దకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మరుసటి రోజు(7వ తేదీన) దాడిని ఖండిస్తూ మండల కేంద్రంలో దళిత బాధితులు నిరసన వ్యక్తంచేశారు. ఈ కేసు తీవ్రతను గుర్తించిన జిల్లా అధికారులు శనివారం డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్, కొల్లాపూర్ సీఐ మహేష్, స్థానిక ఎస్‌ఐ సతీష్ సంఘటన ప్రదేశంలో బాధితులతో విచారించారు. ఇదిలా ఉండగా బాధిత దళితులను పెద్దకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎమ్మార్పీఎస్ కోళ్ల శివ పరామర్శించారు.